## క్లుప్తంగా

### పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడే ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు జంబారపు అహరోను, కార్యదర్శి సి. గంగన్న, ఉపాధ్యక్షులు బాలచౌడన్న తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారం గుంతబజార్‌లోని వారి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీని సత్వరమే అమలు చేయాలని, జాప్యమైతే ఐఆర్ 30 శాతం ఇవ్వాలన్నారు. ఉద్యోగులు పదవీ విరమణ చెందిన రోజునే వారి పెన్షన్ రాయితీలను చెల్లించాలని, ప్రతినెలా 1వ తేదీనే వారి పెన్షన్ వారి ఖాతాలో జమ చేయాలన్నారు. గత మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఈఎల్, గ్రాట్యూటీ చెల్లించాలన్నారు. మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఈహెచ్ఎస్ ద్వారా అనుమతించాలన్నారు.

### ఘన సన్మానం


మహబూబ్‌బాషాను సత్కరిస్తున్న డీఎస్‌డీఓ, కోచ్‌లు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో సుదీర్ఘకాలం మార్కింగ్ వేసి క్రీడాకారుల మన్ననలు పొంది మార్కర్‌బాషాగా పేరుగడించిన మహబూబ్‌బాషా సేవలు అభినందనీయమని డీఎస్‌డీఓ జగన్నాథరెడ్డి పేర్కొన్నారు. కడప నగరంలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో గ్రౌండ్స్‌మాన్‌గా పనిచేస్తూ పదవీవిరమణ చేసిన ఎస్. మహబూబ్‌బాషా సన్మాన కార్యక్రమం ఆదివారం ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ, కోచ్‌లు బాషా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు నూనె నగేష్, కోచ్‌లు అమృత్ రాజ్, అబ్దుల్‌మునాఫ్, శ్రీనివాస్, నూర్, కల్యాణ్, శ్రీధర్, విలియం కేరీ, శ్యామూల్, అనిల్, రాజేంద్ర, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్, సిబ్బంది కంబగిరి, జయరాం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### పాఠ్యపుస్తకాలు త్వరగా అందించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో వెంటనే ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు అందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పలు పాఠశాలలో నాడు- నేడు పనులలో జాప్యం జరుగుతోందని.. త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు అరుణ్ ,శివశంకర్, తేజ తదితరులు పాల్గొన్నారు.

### ఉమ్మడి రాజధానిగా మరో పదేళ్లు పొడిగించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఆంధ్రప్రదేశ్‌తో తెలంగాణకు ఉన్న ఉమ్మడి రాజధాని బంధం నేటితో ముగియనున్న సందర్భంలో హైదరాబాద్ ను ఉమ్మడి రాజధానిగా మరో 10 సంవత్సరాలు పొడిగించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు పరిష్కరింపబడకుండానే శాశ్వత ముగింపు పడిందన్నారు.రాష్ట్ర విభజన చట్టంలో హైదరాబాద్‌ను తెలంగాణకు శాశ్వత రాజధానిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పదేళ్ల పాటు తాత్కాలిక, ఉమ్మడి రాజధానిగా కేంద్రం ప్రకటించిన విషయం అందరికీ తెలిసిన విషయమేనన్నారు. కాగా.. ఉమ్మడి రాజధానిని మరో 10 ఏళ్లు పొడిగించాలని కోరారు.

### అక్రమ అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: కడప, అన్నమయ్య జిల్లాలలో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పాఠశాల విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ అడ్మిషన్లు చేసుకుంటున్నారని, ఆ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ఆర్ఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కడప, పొద్దుటూరు, పులివెందుల, బద్వేల్, మైదుకూరు, రాయచోటి, రాజంపేట, మదనపల్లె, పీలేరు ప్రాంతాల్లో ఉన్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పాఠశాలలు ప్రారంభంకాకముందే 60 శాతం మేర అడ్మిషన్లను పూర్తి చేశారన్నారు. అడ్మిషన్‌కు వచ్చే విద్యార్థులు చేత నిబంధనలకు విరుద్ధంగా రూ. వేల వరకు ఫీజులను వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి సంబంధిత పాఠశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ అన్నమయ్య జిల్లా నాయకులు స్వరూప్, తేజ, మనోజ్, సాయి సందీప్, ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన నృత్య ప్రదర్శనలు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు విద్యార్థులు తమ ఆటపాటలతో సందడి చేశారు. బద్వేలు అనూష్ బాబు అకాడమి విద్యార్థుల ఆధ్వర్యంలో విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. పలు నృత్యాలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. శిల్పారామం రాష్ట్ర పాలనాధికారి మునిరాజు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పులివెందుల టౌన్ : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం, వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఆంధ్ర స్పైస్ రెస్టారెంట్ పులివెందుల వారి సౌజన్యంతో విజయవాడ ఎక్సలెంట్ ఇన్‌స్టిస్యూట్, నాగార్జున స్కూల్ డ్యాన్స్ మాస్టర్ చిట్టి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు వేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్, పాఠశాల కరస్పాండెంట్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


పులివెందులలోని శిల్పారామంలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు


కడప నగరంలోని శిల్పారామంలో నృత్యాలు చేస్తున్న యువత


పులివెందులలోని ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

### బస్టాండ్‌లో వాన నీరు



కడప కోటిరెడ్డిసర్కిల్ : ఓ మోస్తరు వర్షం కురిసినా కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణంలో ఒకటి నుంచి రెండు రోజులపాటు వర్షపు నీరు నిల్వ ఉంటోంది. శనివారం పొద్దుపోయాక వర్షం కురవగా ఆదివారం రాత్రి వరకు బస్టాండులో నీరు నిలబడి ఉంది. ఈ కారణంగా ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు నీటిని దాటుకునేందుకు ఇబ్బందులు పడ్డారు.

### వేసవి శిబిరాల ద్వారా శాస్త్రీయ పరిజ్ఞానం


మ్యాజిక్‌లోని ట్రిక్కులను తెలియజేస్తున్న సమీర్‌బాష

కడప కల్చరల్ : వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం నిర్వహించే వేసవి శిక్షణా శిబిరాల ద్వారా వారికి శాస్త్రీయ పరిజ్ఞానం పట్ల అవగాహన పెరిగే అవకాశం ఉందని జన విజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి సమీర్‌బాష అన్నారు. వేసవి శిక్షణా శిబిరాలలో భాగంగా కడప నగరం కొండాయపల్లెలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి చైతన్యవంతులను చేసేందుకు ఇలాంటి శిబిరాలు ఎంతైనా అవసరమన్నారు. టెక్నాలజీ పెరుగుతున్న ప్రస్తుత రోజుల్లో కూడా గారడీ బాబాలు, దొంగ స్వామిజీలు, భూత వైద్యులు, సైన్స్ ట్రిక్కులను మంత్ర తంత్రాలుగా అమాయక ప్రజలను నమ్మించి దోపిడీ చేస్తున్నారన్నారు. ప్రజలు అలాంటివారిని నమ్మకూడదని, మాయలు, మంత్రాలు లేవని తెలుసుకోవాలన్నారు. మ్యాజిక్ అంశాల పట్ల శాస్త్రీయతను ఆయన సోదాహరణంగా వివరించారు. శిబిరానికి విచ్చేసిన విద్యార్థుల చేత కూడా చేయించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్, లైబ్రేరియన్ సుబ్రమణ్యం, సుబ్బమ్మ, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### కనుల పండవగా పాలేటమ్మ తిరునాల



చిన్నమండెం : మండలంలోని కలిబండ గ్రామంలో వెలసిన పాలేటమ్మ తిరునాల శనివారం రాత్రి కనుల పండువగా సాగింది. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో దాదాపు ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి జంతుబలులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళ వాయిద్యాలు, బళ్లారి డ్రమ్స్, చెక్కభజనల నడుమ అమ్మవారికి మొక్కులు సమర్పించారు. మొక్కుబడులు ఉన్న వారు అమ్మవారికి చాందినీబండ్లు కట్టారు. శనివారం రాత్రి ఎడతెరిపి లేని వర్షం కురవడంతో ఇదంతా అమ్మవారి కృపతోనే జరిగిందని ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

# ఆరోగ్యం.. ఆనందం..

**నేడు అంతర్జాతీయ సైకిల్ దినోత్సవం**



కడప స్పోర్ట్స్ : ప్రస్తుత పోటీప్రపంచంలో ఉదయం మొదలు రాత్రి నిద్రపోయే వరకు ఎంతో ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ప్రతి రోజూ సైకిల్ తొక్కడం ద్వారా ఒత్తిడిని దూరం చేసుకోవడంతో పాటు ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

**ప్రమాదాలూ తక్కువే..**

నిత్యం కార్లు, ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఎంతో మంది చనిపోతున్నారు. అదే సైకిల్‌పై ప్రయాణం చేస్తే రోడ్డుప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. సైకిల్‌తో ఢీకొట్టినా పెద్దగా ప్రమాదం ఉండదు.

**కండరాల శక్తిని పెంచుతుంది..**

వాహనాల వినియోగం పెరిగి, శారీరక శ్రమలేకపోవడంతో శరీరంలో కొవ్వు పేరుకుపోతోంది. శరీరంలో పేరుకుపోయిన కొవ్వును సైకిల్ తొక్కడం ద్వారా తగ్గించవచ్చు.

**కాలుష్య నివారిణి**

రోజూ రహదారిపై వేలాది వాహనాలు వెళ్తుంటాయి. ద్విచక్ర వాహనాలు, కార్లు, ట్రక్కులు, బస్సులు, ఆటోలు ఇలా అనేక వాహనాలు ప్రయాణిస్తుంటాయి. వీటి నుంచి వచ్చే హైడ్రోకార్బన్స్, నత్రజని ఆక్సైడ్‌లు, కార్బన్‌మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, గ్రీన్‌హౌస్ వాయువులు వెలువడుతుంటాయి. అవన్నీ మానవ శరీరంపై ప్రభావాన్ని చూపిస్తాయి. సైకిల్‌పై వెళ్లడం వల్ల కాలుష్యాన్ని తగ్గించవచ్చు. ఎటువంటి హానికరమైన పదార్థాలు వెలువడవు కనుక ఇతరులకు ఇబ్బంది కలుగదు.

**పిల్లలకు నేర్పిస్తున్న తల్లిదండ్రులు**

వేసవి సెలవులు రావడంతో చిన్నారులను సెల్ ఫోన్లు, ట్యాబ్‌లు, టీవీలకు దూరంగా ఉంచేందుకు పలువురు తల్లిదండ్రులు.. వారికి సైకిల్ నేర్పించడంతోపాటు కొనిచ్చి సాధన చేయిస్తుండటం విశేషం. దీంతోపాటు పెద్దలు సైతం రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో కడప నగరంలోని విశాలమైన రహదారుల్లో సైక్లింగ్ చేస్తూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తుండటం గమనార్హం.

**సెలవుల్లో నేర్చుకున్నా..**



సెలవులు రావడంతో నేను సైకిల్‌ను బాగా నేర్చుకున్నా. గతంలో మా నాన్న సైకిల్ పట్టుకుని నేర్పించేవాడు. ఇప్పుడు నేనే సొంతంగా సైకిల్ తొక్కుతున్నా.
– కార్తీక్, 3వ తరగతి విద్యార్థి, కడప

**కొత్తది కొనిపించుకున్నా**



వేసవి సెలవుల్లో ఆటల తోపాటు సైకిల్ తొక్కడం నాకెంతో ఇష్టం. గతేడాది కొత్త సైకిల్ కొనిపించుకున్నా. అప్పుడప్పుడు బడికి సైకిల్‌పై వెళ్తున్నా.
– డి.నాగచరిత్, 6వ తరగతి విద్యార్థి, కడప

**సైక్లింగ్‌తో ఆరోగ్యం**



ప్రస్తుత పరిస్థితుల్లో ద్విచక్ర వాహనాలు, కార్లలో ఎలాంటి శ్రమలేకుండా వెళ్తున్నారు. సైకిల్‌పై వెళ్లడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. సైకిల్ తొక్కడం ఉత్తమ వ్యాయామం. – డాక్టర్ రామసుబ్బారెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్ విభాగాధిపతి, వైవీయూ

## అచ్చవెల్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని అచ్చవెల్లి గ్రామ సమీపంలో ఉన్న అచ్చవెల్లి గంగమ్మకు ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మ తల్లిగా ఎంతో ప్రసిద్ధి గాంచింది. అమ్మవారిని దర్శించు కోవడానికి పులివెందుల మండలం నుంచే కాక, కడప, కర్నూల్, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. దీంతో ఆలయ అర్చకులు దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేస్తారు.

# అత్యవసరమైతేనే బయటకు రావాలి


కమలాపురంలో కవాతు చేస్తున్న సీఐ, ఎస్ఐ, సిబ్బంది


సింహాద్రిపురంలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న రూరల్ సీఐ బాలమద్దిలేటి

కమలాపురం : సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా చివరి ఘట్టమైన కౌంటింగ్ పూర్తి అయ్యే వరకు ఎవరూ బయటకు రావద్దని, అత్యవసరమైతేనే బయటకు రావాలని సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకుని ముందు జాగ్రత్త చర్యగా ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయన సిబ్బందితో కలసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు ఎమర్జెన్సీ మెడికల్ దుకాణాలు తప్ప ఏ దుకాణం తెరవరాదన్నారు. అలా కాదని శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైన ప్రవర్తిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 144 సీఆర్‌పీసీ, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ప్రజలు నలుగురికి మించి గుంపులుగా ఉండరాదన్నారు. మద్యం సేవించి ఒకరితో మరొకరు గొడవలకు దిగితే తాటా తీస్తామని హెచ్చరించారు. గెలిచిన వారు ర్యాలీలు, ఊరేగింపులు, బాణా సంచాలు కాల్చడం, డీజేలు పెట్టడం, డ్రమ్ములు కొట్టడం చేయరాదన్నారు. గెలిచిన పార్టీకి చెందిన వారు ఓడిపోయిన పార్టీ వారిని రెచ్చగొట్టడం, కవ్వింపు చర్యలకు పాల్పడటం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. అత్యవసరమైతే తప్పా 5వ తేదీ ఉదయం 6 గంటల వరకు ప్రజలెవరూ బయటకు రావదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ హృషికేశ్వర్ రెడ్డి, ఆక్టోపస్ ఆర్ఐ నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు**

సింహాద్రిపురం : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పులివెందుల రూరల్ సీఐ బాలమద్దిలేటి హెచ్చరించారు. ఆదివారం మండలంలోని రౌడీషీటర్లను స్టేషన్‌కు పిలిపించుకుని కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో గొడవలకు పాల్పడినా, టపాసులు పేల్చినా, సమస్యలు సృష్టించినా వారిపై కేసు నమోదు చేసి రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరించి గొడవలు సృష్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**37 మందికి నోటీసులు జారీ**

ఎర్రగుంట్ల : మండల పరిధి కలమల్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 37 మందికి నోటీసులు జారీ చేసి నాలుగురిని హౌస్ అరెస్టు చేసినట్లు కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డి ఆదివారం తెలిపారు. కౌంటింగ్ జరుగుతున్న సందర్భంగా గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందు ముందస్తుగా అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఇల్లూరులో ముగ్గరు, మాలెపాడులో ఒక్కరిని హౌస్ అరెస్టు చేశామన్నారు. గ్రామంలో బందోబస్తుతో పాటు నిఘా పెట్టామన్నారు.

## వినూత్న ప్రయోగం.. బైకుతో సేద్యం

పులివెందుల రూరల్ : నియోజకవర్గ వ్యాప్తంగా పలు మండలాలు, గ్రామాల్లో వినూత్న ప్రయోగాలతో రైతులు బైకుతో సేద్యం చేస్తున్నారు. బిందు తుంపెర సేద్యం అనేది కాకుండా బైకు సేద్యం ఉంటుందని ఒక రైతు వినూత్న ప్రయోగం చేపట్టాడు. కాడెద్దులు కరువై.. యంత్రాల సేద్యం బరువైన నేపథ్యంలో ఈ బైకు సేద్యంను ఇప్పుడిప్పుడే రైతులు అలవాటు చేసుకుంటున్నారు. అరటి పంటలో ఎద్దులు, ట్రాక్టర్ సేద్యం తరహాలో బైకు సహాయంతో కలుపు నివారణ పనులను లింగాల మండలంలో ఓ రైతు చేస్తున్నారు. ఇలాంటి బైకు సేద్యాలు విజయవంతమైతే ప్రతి ఒక్క రైతు బైకు సేద్యం వైపు మొగ్గుచూపే అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు.


బైకుతో కలుపు నివారణ చేపడుతున్న దృశ్యం

# పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


అరటి పంటను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె మండలంలో తీవ్ర వర్షాభావం, ఎండల తీవ్రతతో బోరు బావులు అడుగంటి పోవడంతో అరటి, చీని, నిమ్మ, ఆకు తోటలను తక్షణమే ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఆదివారం ఉదయం మండలంలోని లింగారెడ్డిపల్లి, కొలుములపల్లె పంచాయతీలోని పంట పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ సంవత్సరం తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఒకపక్క, మరోపక్క ఎండ తీవ్రతతో బోరు బావులు అడుగంటి పోవడంతో రైతులు వేసిన అరటి, చీనీ, నిమ్మ పంటలు కోత దశలో నీటి తడులు అందక నిట్ట నిలువునా ఎండిపోతున్నాయని ఆయన తెలిపారు. అరటి, ఆకు తోటలకు సాగు పెట్టుబడి ఖర్చులు ఎకరాకు లక్ష రూపాయలు పైగా ఖర్చు వస్తున్నదని, ఈ తరుణంలో బోరు బావులు భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో లేత దశలోనే పంటలు ఎండిపోతున్నాయన్నారు. కౌలు రైతుల పరిస్థితి మరి దారుణంగా ఉన్నదన్నారు. ఎకరాకు కౌలు 50 వేలకు పైగా పెట్టి సాగు చేస్తున్నారన్నారు. జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాలలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో పంటలు నష్టపోయిన రైతులను కలుపుకుని పోరాటాలకు శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాలకృష్ణయ్య, దస్తగిరిరెడ్డి, మండల నాయకులు రంగారెడ్డి, చిన్నసిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆదివారం సాయంత్రం పులివెందులలోని శ్రీకృష్ణుని ఆలయాన్ని మేఘాలు కమ్ముకున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది - పులివెందుల రూరల్

## భగవద్గీత పఠనం.. విజ్ఞానదాయకం

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతిరోజు భగవద్గీతను పఠిస్తే జీవితం ఆనందంగా సాగుతుందని కృష్ణచైతన్యస్వామి పేర్కొన్నారు. భగవద్గీతను ప్రతి ఒక్కరూ పఠించాలని సూచించారు. స్థానిక గీతాశ్రమం వీధిలోని వేదాంతం లక్ష్మణార్యుల ఆశ్రమంలో చిన్నారులకు ఉచిత భగవద్గీత శిక్షణ తరగతుల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత చదవడం వలన మంచి, చెడుల విచక్షణ తెలుస్తుందన్నారు. భగవద్గీత గొప్పతనాన్ని వివరించారు. ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలన్నారు. ఆశ్రమ అధ్యక్షుడు వద్ది నరసింహులు మాట్లాడుతూ 10 ఏళ్లుగా ప్రతి ఏడాది వేసవి సెలవుల్లో విద్యార్థులకు భగవద్గీతపై ఉచిత శిక్షణ ఇచ్చి భగవద్గీత ప్రాముఖ్యతను అందరికి తెలియచేస్తున్నామన్నారు. ఈ ఏడాది భగవద్గీతలోని 10వ అధ్యాయం విభూధియోగంపై శిక్షణ ఇచ్చామన్నారు. నెల రోజుల భగవద్గీత శిక్షణ అనంతరం సీనియర్స్, జూనియర్స్ విభాగంలో చిన్నారులకు రాత పరీక్ష, మౌఖిక పరీక్ష నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ బహుమతి అందజేశారు. అలాగే ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పాల్గొన్న విద్యార్థులందరికి కన్సోలేషన్ బహుమతులను అందచేశారు. అనంతరం చిన్నారులందరూ భగవద్గీత శ్లోకాలను పఠించారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తొగటవీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక వసంతపేటలోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం తొగటవీర క్షత్రియ విద్యార్థులకు 12వ వార్షిక ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దాతల సహకారంతో ప్రతిభాపురస్కారాలను సంఘం ఆధ్వర్యంలో అందచేస్తున్నామని తెలిపారు. ఎవరైనా ఆర్థిక స్తోమత లేని ప్రతిభ గల తొగటవీర విద్యార్థులు ఉంటే సంఘాన్ని కలిస్తే తగిన సహకారం అందిస్తామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 10వ తరగతి ఉత్తమ మా ర్కులు సాధించిన, స్థానికంగా ఇంటర్ చదివి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో మంచిమార్కులు సాధించిన విద్యార్థు లకు ఆర్థిక సహాయం అందచేశారు.